క్లుప్తంగా

మహిళలకు గొడుగుల పంపిణీ



మహిళలకు గొడుగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: వేసవికాలం ప్రారంభం కావడంతో నగరంలో చిరువ్యాపారాలు చేసుకునే మహిళలకు లయన్స్ క్లబ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, కార్యదర్శి పార్థసారథి, కోశాధికారి స్వామి, పూర్వ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, రాంబాబు, గోపి, కిశోర్, విజయ్, శ్రీనివాస్, రవి, శంకరరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల మృతి తీరనిలోటు

ఒంగోలు మెట్రో: అభినవ అన్నమయ్యగా పేరొందిన ప్రముఖ గాయకుడు డాక్టర్ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందడంపై ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పరిపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గరిమెళ్ల శ్రీగిరి దేవస్థానానికి సుపరిచితులని, శ్రీగిరి బ్రహ్మోత్సవాలతో పాటు పలు కార్యక్రమాలలో ఆయన తన సుమధుర గానంతో భక్తులను తన్మయులను చేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి ఆధ్యాత్మిక సంగీత రంగానికి తీరని లోటని అన్నారు. అతని కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేసిన వారిలో శ్రీగిరి ఆలయ చైర్‌పర్సన్‌తో పాటు ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జయశంకర్, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్ వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

147 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ

గుడ్లూరు: వీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 147 మందికి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఆదివారం గుడ్లూరు మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు టీడీపీ అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, దివిశివరామ్ నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

కొండపి: మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు సమానత్వం సమాన హక్కులు సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు నిచ్చారు. పెరిదేపి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవ స్ఫూర్తితో అటువంటి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు విశ్రాంత, మండల కార్యదర్శి మాధవి, సంపూర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

సర్వేలతో సతమతం..!

- కూటమి అనాలోచిత నిర్ణయాలతో పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి
- టార్గెట్లు పెట్టి మరీ మానసిక వేధింపులు
- దీర్ఘకాలిక సెలవుల యోచనలో పలువురు కార్యదర్శులు



ఉప్పుగుండూరు గ్రామ సచివాలయం

నాగులుప్పలపాడు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలు, నిర్ణయాలకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మానసిక వేధింపులకు, తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పనిభారం పెంచి టార్గెట్లు విధించి జిల్లా, మండల స్థాయి అధికారుల ద్వారా తీవ్రంగా వేధిస్తుండటంతో కార్యదర్శులు బలైపోతున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డు జియో ట్యాగింగ్, పీ4 సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, పీఏసీఎస్ సర్వే, లెదర్ ఆర్డినెన్స్ సర్వే, 0–6 సంవత్సరాల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లతో పాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణలు అడుగుతుండటంతో సచివాలయాల సిబ్బంది సతమతమవుతున్నారు. అంతిమంగా ఈ పనిభారం మొత్తం ప్రోగ్రెస్ రూపంలో పంచాయతీ కార్యదర్శులపై పడి వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నాగులుప్పలపాడు మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న పలువురు కార్యదర్శులు మూకుమ్మడిగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కుట్టుమిషన్లు, గ్రైండర్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు తండ్రి జ్ఞాపకార్థం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఆదివారం శ్రీధర్‌బాబు తండ్రి 22వ వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని ఎస్కేఆర్ బధిరుల పాఠశాలలో నిర్వహించిన సేవా కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 22 సంవత్సరాలుగా మన్నం శ్రీధర్, వారి సోదరులు తమ తండ్రిని గుర్తు చేసుకుంటూ పేదలకు అందిస్తున్న సేవలు అమూల్యమన్నారు. ఇలాంటి సేవలను రానున్న రోజుల్లో కూడా విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. మన్నం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఇద్దరు పేద మహిళలకు కుట్టు మిషన్లు, ఒకరికి గ్రైండర్‌ను బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా అందించారు. బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు మంచాల కోసం రూ.27 వేలను ప్రిన్సిపాల్ అంజిరెడ్డికి అందించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, డాక్టర్ బీ జవహర్, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, గోపురపు చంద్ర, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్.సూర్యచంద్రరావు, శ్రీధర్‌బాబు సోదరులు రామకృష్ణ, రాము, స్థానికులు పాల్గొన్నారు.

పేర్నమిట్ట.. సమస్యల పుట్ట

- సీపీఎం బృందం పర్యటనలో సమస్యలు ఏకరువు పెట్టిన స్థానికులు



పాడైపోయిన సిమెంట్ రోడ్డు, మురుగు కాలువను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

సంతనూతలపాడు: ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండో రోజైన ఆదివారం మండలంలోని పేర్నమిట్టలో శాంతినగర్, అంబేడ్కర్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, ఉత్తర బజారు, తదితర ప్రాంతాల్లో సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అనేక సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. గత సంవత్సరం నాలుగు ప్రాంతాల్లో మంచినీటి పైపులైను వేసినా ఇంతవరకు కనెక్షన్ ఇవ్వని కారణంగా నీళ్లు రాక కొనుగోలు చేసి వాడుకోవాల్సి వస్తోందని, నీటి కోసం నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొన్ని కుటుంబాలకు ఇంటి పన్ను వేయని కారణంగా కుళాయి కనెక్షన్ కోసం వెళ్తే పన్నులు వేయించుకోవాలని చెబుతున్నారన్నారు. అధికారులు మాత్రం పన్నులు వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కుమ్మరిపాలెంలో రోడ్డు దెబ్బతిని వాహనాలు, ప్రజలు గుల్లవుతున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా మురుగునీరు ఊరి బయటకు పోయే మార్గం లేక ఎక్కడికక్కడే నిలుస్తోందన్నారు. దాని కారణంగా దోమలు వ్యాపించి జబ్బులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వతంగా మురికినీరు బయటకు వెళ్లి పోతురాజు కాలువలో కలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల పట్టాలిచ్చారుగానీ స్థలాలు చూపలేదని, అద్దె ఇళ్లలో ఉంటూ అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన చెందారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శివర్గ సభ్యుడు నెరుసుల వెంకటేశ్వర్లు శాఖా కార్యదర్శి అన్నం వెంకట సుబ్బారావు, నాయకులు తుళ్లూరు సుబ్బారావు, పొత్తూరు చిన్న శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం చీమకుర్తిలోని రామ్‌నగర్‌లో పార్టీ కార్యకర్తలతో పర్యటించి ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. తాగునీటి పైపులకు కుళాయిలు లేవని, తాగునీరు సకాలంలో రావడం లేదని, విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, హైటెన్షన్ కరెంటు తీగలు ఇళ్లపై నుంచి వెళ్తుండటం వలన సమస్యలు ఏర్పడుతున్నాయని సీపీఎం నాయకుల దృష్టికి స్థానిక ప్రజలు తీసుకొచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీపీఎం నాయకులు తెలిపారు.

కోదండ రామయ్యకు పునర్వసు నక్షత్ర పూజలు



సుగంధ పరిమళ ద్రవ్యాల అభిషేకం అందుకుంటున్న కోదండరాముడు

ఒంగోలు మెట్రో: శ్రీరామచంద్రుడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం, ఆదివారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామాలయాలలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలులోని పీవీఆర్ గర్ల్స్ హైస్కూల్ ఘడియారం వారివీధిలోని అనంత కోదండరామస్వామి మందిరంలో, ఐశ్వర్యనగర్‌లోని రామాలయంలో, గాంధీ రోడ్డులోని అనంత కోదండరామస్వామి దేవస్థానంలో, గోపాల్‌నగర్‌లోని రామమందిరంలో, సీతారాంపురంలోని సీతా సమేత కోదండరామస్వామి దేవాలయంలో, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైన్‌లోని సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో, రాంనగర్, మామిడిపాలెం, గద్దలగుంట రామాలయాలలో, స్వామివారు, అమ్మవార్ల మూల విరాట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోదండ రామస్వామి దేవస్థానం (రామక్షేత్రం), వలేటివారి పాలెంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రాతఃకాలమున పంచామృతాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, ద్రవ్య ఆరాధన నిర్వహించి స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ డీటీఓ



మంత్రి దోలాతో ఆర్టీసీ డీటీఓ వెంకటరావు

ఒంగోలు టౌన్: ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి కె.వెంకటరావు ఆదివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం డీటీఓగా పనిచేస్తున్న డి.సుధాకర్ గత నెలలో రిటైరయ్యారు. ఆయన స్థానంలో వెంకటరావు ఇటీవలే ఒంగోలు డీటీఓగా బాధ్యతలు చేపట్టారు. విజయవాడలో సీటీఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. గతంలో విశాఖపట్నం కమర్షియల్ సీటీఎంగా పనిచేసిన సమయంలో విశాఖ డిపోను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపారు. ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతున్న ఒంగోలు ఆర్టీసీ డిపోను గాడిలో పెట్టడం ఆయన ముందున్న సవాల్ అని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. డిపోలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బయటి వాహనాలు, ఆటోలు డిపో లోపలకు వచ్చి ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అలాగే, బస్టాండులో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం లేదు. మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. మంచినీటి కనెక్షన్ కట్ చేయడంతో ఆర్ఓ ప్లాంటు కూడా పనిచేయడం లేదు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుందని యూనియన్ నాయకులు చెబుతున్నారు.

సమయస్ఫూర్తితో సమస్యలు దూరం



చిన్నారులతో గ్రంథాలయ ఉపపాలకురాలు కోటేశ్వరి, ఉపాధ్యాయుడు జాలాది మోహన్

ఒంగోలు టౌన్: పిల్లలకు సమయస్ఫూర్తి చాలా అవసరమని, సరైన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి సమస్యల నుంచి బయట పడవచ్చని బహుజన ఉపాధ్యాయ నాయకుడు జాలాది మోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు సమయస్ఫూర్తి గురించి బోధించారు. అనుకోకుండా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఒత్తిడికి గురికాకుండా సమయస్ఫూర్తితో బయటపడాలని సూచించారు. చిన్నారులతో నీతి కథలు చదివించడమే కాకుండా వారిచేత సొంతంగా కథలు చెప్పించారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ తరఫున చిన్నారులకు పెన్నులు బహుమతిగా ఇచ్చారు. గ్రంథాలయ సిబ్బంది ఎస్.అనిల్‌బాబు, ఇమ్మానియేలు, తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో బిల్ కలెక్టర్ చేతివాటం

సింగరాయకొండ: ఇంటిపన్ను రశీదులో పేరు మారాలంటే నజరానా ఇవ్వాల్సిందేనని సింగరాయకొండ పంచాయతీ బిల్ కలెక్టరు శ్రీనివాసరావు డిమాండ్ చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలోని ఈద్గమిట్టలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కోవూరి వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి వద్ద ఇంటిపన్ను రశీదులో అతని భార్య పేరు మారుస్తానని రూ.10 వేలు వసూలు చేశాడు. కాని నెలరోజులైనా కూడా పేరు మారకపోవడంతో ఇటీవల పంచాయతీ కార్యాలయానికి వచ్చి పంచాయతీ కార్యదర్శి జగదీష్ వద్ద పంచాయతీ పెట్టాడు. అంతేకాక బాధితుడు సుబ్బారెడ్డి మంత్రి నారా లోకేష్ పీఏతో పంచాయతీ కార్యదర్శి జగదీష్‌కు కూడా ఫోన్ చేయించాడు. దీంతో చివరికి జగదీష్ సూచనలతో బిల్ కలెక్టర్ శ్రీనివాసరావు వెంటనే 10 వేలను సుబ్బారెడ్డి ఫోన్ పేకు చెల్లించాడు. ఇంటిపన్ను రశీదులో పేరు మారాలంటే వెంటనే జరగదని కొంత సమయం పడుతుందని కావున త్వరలో రశీదులో పేరు మారుస్తానని కార్యదర్శి జగదీష్ బుజ్జగించి సుబ్బారెడ్డిని పంపించాడు.

చాలా మంది బాధితులు..

దీనిపై సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో నేను ఇంటిపన్ను కడితే రశీదు కూడా ఇచ్చారని కాని తరువాత సంవత్సరం రెండు సంవత్సరాలు కట్టాలంటూ డిమాండ్ నోటీసు ఇచ్చారని దీనిపై తాను రోజులబడి తిరిగితే చివరకు పన్ను కట్టినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నా లాగే చాలామంది ఇంటిపన్ను బాధితులు ఉన్నారని వీరు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని సుబ్బారెడ్డి ఆరోపించారు. తరువాత ఈ విషయం తెలిసిన టీ కొట్టు యజమాని నేను కూడా ఇంటిపన్ను రశీదులో పేరు మార్చాలని రూ.30 వేలు ఇచ్చానని కార్యాలయానికి రావడంతో అతనికి కూడా డబ్బులు తిరిగి ఇచ్చాడని సిబ్బంది తెలియజేస్తున్నారు. తోపుడు బండ్ల వద్ద వ్యాపారపు పన్ను రూ.1000 కాగా రూ.1100 కట్టించుకున్నాడని తోపుడుబండ్ల వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

మహిళా సమాఖ్య ఒంగోలు నూతన కమిటీ ఎన్నిక



మహిళా సమాఖ్య నగర కమిటీ సభ్యులతో జిల్లా నాయకులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఒంగోలు నగర నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ కన్వీనర్‌గా మన్నేపల్లి ప్రమీల, కో కన్వీనర్లుగా మల్లేశ్వరి, విజయ భారతి, చౌటూరి పోలమ్మతో పాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్.రావమ్మ, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయ, అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. నూతన కమిటీ సభ్యులను సీపీఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాస్ అభినందించారు. ఒంగోలు నగరంలో ఇళ్ల స్థలాల కోసం జరుగుతున్న పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.

నువ్వు చల్లకుండ!





మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కనిగిరిరూరల్: ఈ ఏడాది వేసవి తన ప్రతాపాన్ని గతేడాది కంటే ఎక్కువగా చూపిస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి తాపం పెరిగింది.. దాహార్తి తీవ్రంగా ఉంది. పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుత కాలంలో చల్లని నీటి కోసం తహతహలాడే ప్రజలు ఫ్రిజ్, ఐస్ వాటర్ నీటిని తాగితే రోగాలు కొని తెచ్చుకున్నట్లేనని వైద్య నిపుణులు చెప్తున్నారు. సహజ సిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే. నీటిలోని హానికర బ్యాక్టీరియా, వైరస్‌లను లేకుండా శుభ్రపరిచే మట్టికుండ నీరే శ్రేయస్కరమని వైద్యులు వెల్లడిస్తున్నారు. దీంతో ఇంత కాలం మట్టి కుండల వైపు కన్నెత్తి చూడని వారు సైతం రకరకాల మట్టికుండల కొనుగోలుకు పరుగులు పెడుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

సహజ సిద్ధంగా మట్టి కుండలోని నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు. అందువల్ల ప్రజలు వాటి వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మండుతున్న ఎండల్లో తిరిగి అలసటతో ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలో నీరు తాగితే ఎంతో ఊరట లభిస్తోంది. ఎంతో ఖరీదైనా ఫ్రిజ్‌లున్నా ధనవంతులు సైతం నేడు మట్టి కుండలో నీటిని తాగేందుకు ఇష్టపడుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ కొందరు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి కుండల్లోనే వంటలు వండుకుంటున్నారు. ఫ్యాషన్ పేరితో మట్టి పాత్రల వినియోగం తగ్గించి రోగాల బారిన పడుతున్నారనేది నగ్న సత్యం. అల్యూమినియం, స్టీల్ పాత్రల్లో సిద్ధం చేసిన ఆహార పదార్థాలతో పాటు ఫ్రిజ్‌లలో నీటిని తాగే వారు అనారోగ్యాలకు గురవుతున్నారనడంలో సందేహం లేదు.

రేడియేషన్‌తో ఆరోగ్యానికి చేటు..

మారుతున్న కాలానుగుణంగా వాతావరణంలోను విపరీతమైన మార్పులు వచ్చాయి. సెల్ టవర్లు, ఏసీలు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రీజ్‌లు, ఓవెన్‌లు, సెల్ ఫోన్లు తదితర రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాల మధ్య యాంత్రిక జీవనానికి మనుషులు అలవాటు పడ్డారు. దీని వల్ల అనేక దుష్పరిణామాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం రేడియేషన్‌కు గురైతే దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడక తప్పదని తెలిపారు.

పెరిగిన మట్టి కుండల అమ్మకాలు..

గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత తీవ్రత పెరగడంతో కుండల కొనుగోలు దారుల సంఖ్య పెరిగింది. కుండల అమ్మకపు దారులు తెనాలి, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి కుండలు దిగుమతి చేసి.. వివిధ రకాల ఆకృతులు కల్గిన కుండలను స్థానిక కోర్టు సెంటర్ (కనిగిరి కందుకూరు రూట్‌లో) అమ్మకాలు చేస్తున్నారు. నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కనిగిరికి వివిధ గ్రామాల నుంచి వచ్చే గ్రామీణులు, పట్టణ ప్రజలు కుండల కొనుగోళ్లకు ఆసక్తి పెంచారు. దీంతో అమ్మకపు దారులు కుండల అమ్మకాల రేట్లు కూడా పెంచారు. గతేడాది రూ.300 ఉన్నా చిన్న కుండను ఇప్పుడు రూ.350, గతంలో రూ. 350 ఉన్న కుండను ప్రస్తుతం రూ.400 అమ్ముతున్నారు. కుండలో నీటిని తాగడం ద్వారా దప్పిక తీరడంతో పాటు, ఆల్కలైన్ లక్షణాలు నీటి పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తాయని వైద్యులు చెప్పడటంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. దీంతో ప్రతి రోజు 20 నుంచి30 కుండలకు పైగా అమ్మకాలు జరుగుతున్నాయని, మూడు, నాలుగు నెలలు అమ్మకాలు జరుగుతాయని విక్రయదారులు తెలిపారు.

మట్టికుండలో నీరు ఎంతో మంచిది..



మట్టి కుండలో ఉంచిన నీటిని తాగే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మట్టికుండలో నీటిలో పోషక విలువలు ఉంటాయి. దీని వల్లన ఒంట్లో వేడి తగ్గుతుంది. జలుబు, దగ్గు వంటివి దరి చేరవు. ఫ్రిజ్‌లో నీటిని ఎక్కువగా తాగడం వలన ఆరోగ్య, పళ్ల సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉంది. మట్టికుండలో నీరు చల్లదనంతో పాటు.. ఆరోగ్యానికి మేలు. నీటి పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తోంది. ఫ్రిజ్‌లో నీళ్ల తాగడం నోటిలో లాలాజం ఉత్పత్తి తగ్గి.. నోరు ఎండిపోతుంది. అతిగా ఫ్రీజ్ వాటర్ తాగితే నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, దంత వైద్యులు

పాకల బీచ్‌లో మందుబాబుల హల్‌చల్

- భయాందోళన చెందుతున్న పర్యాటకులు



పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సందడిగా గడిపారు. మెరైన్ పోలీసులు పర్యాటకులను సముద్రంలోకి ఎక్కువ దూరం వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ తీరం వెంబడి పర్యాటకులను అప్రమత్తం చేశారు. సెలవు దినం కావడంతో మండలంతో పాటు చుట్టు ప్రక్కల మండలాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

తీరంలో మద్యం ప్రియుల అలజడి..

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బీచ్‌లో నిర్మాణ దశలో ఉన్న రెస్టారెంట్ మద్యం ప్రియులకు, పేకాట రాయుళ్లకు అడ్డాగా మారింది. ఈ రెస్టారెంట్ వద్ద జూదరులు పేకాట ఆడుకుంటూ సందడిగా గడిపారు. మద్యం ప్రియులు బహిరంగంగా మద్యం సేవిస్తూ సేదతీరారు. బీచ్ వద్ద మోటారు సైకిల్ తో మద్యం ప్రియుడు చేసిన ఫీట్స్ చూపరులను భయాందోళన కలిగించాయి. మద్యం మత్తులో మోటారుసైకిల్‌ను అదుపు చేయలేక పడేశాడు.